# కూచిపూడికి ఆదరణ కరవు: వెంపటి చిన సత్యం

కల్చరల్ కంట్రిబ్యూటర్

విశాఖపట్నం, జూన్ 2: కూచిపూడి కళకు రానురాను ఆదరణ కరవవుతోందని ప్రఖ్యాత నృత్యకారుడు వెంపటి చినసత్యం ఆవేదనతో అన్నారు. స్థానిక కళాభారతి ఆవరణలో కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అటు ప్రభుత్వం నుంచి ఇటు ప్రజల నుంచి కూచిపూడి నృత్యానికి ఆదరణ కరవవుతోందని, దీనిని కాపాడేందుకు అందరి సహకారం అవసరమని అన్నారు. ఆదివారం సాయంత్రం కళాభారతిలో కుమారి నీలిమ నృత్యప్రదర్శన ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలిమ తన శిష్యురాలని అన్నారు.తమ ఆధ్వర్యంలో చాలా మంది విద్య నేర్చుకొని విదేశాలలో ప్రదర్శనలిచ్చి అందరి మన్ననలు అందుకొన్నా ఎవరి నుంచి తృప్తికరమైన సహాయం ప్రోత్సాహం అందడం లేదని చెప్పారు.

## 6 నుంచి సిద్ధసమాధి యోగలో ఉచిత శిక్షణ

ఈ నెల ఆరో తేదీ నుంచి పద్దెనిమిది రోజుల పాటు నిర్వహించే సిద్ధసమాధియోగ ఉచిత శిక్షణ తరగతులకు హాజరు కావలసిందిగా నగర వాసులను క్షత్రియ సంక్షేమ సమితి కార్యదర్శి జంపన కుమారవర్మ కోరారు. ఈ తరగతులలో చేరే వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, తప్పనిసరిగా క్లాసులకు రావాలని, ఆహార నియమాలను పాటించాలని చెబుతూ ప్రతిరోజూ ఉదయం ఐదు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. ధ్యానం, ప్రాణాయామం, యోగాసనాలు, ఆహారపు అలవాట్లు, జీవన విధానం, సంపూర్ణ ఆనందం పొందడానికి నిర్వాహకులు చెప్పే సూత్రాలు చాలా ముఖ్యమైనవని అన్నారు.

## అద్వితీయం అధ్యాత్మ రామాయణం

స్థానిక రామకృష్ణామిషన్ అడిటోరియంలో శనివారం స్వామి అమృతానంద చేసిన ప్రసంగం భక్తులను అలరించింది. అధ్యాత్మ రామాయణం నుంచి ఆయన వివరించిన అశోకవనంలో సీత అన్న విషయంలో స్వామి చెప్పిన పలు అంశాలు ప్రేక్షకులను రంజింప చేశాయి. 'అశోకం' అంటే శోకం లేనిదని, కాని సీతాసాధ్వి శోకం లేకుండా ఉండగలిగే చోటులో కూడా శోకిస్తూ కూర్చోగలిగింది అంటే రామునిపై ఆమెకు గల భక్తి, ప్రేమ కారణాలని తెలిపారు.

## ఉమాసహస్రం ఆవిష్కరణ

కావ్యకంఠ గణపతిముని వంటి కవుల సాహిత్యాన్ని అనువదించడం దైవకార్యం లాంటిదని ఉమాసహస్రం పుస్తకావిష్కరణ సభలో శర్మ అన్నారు.స్థానిక కృష్ణాశ్రమంలో విశాఖ సారస్వత వేదిక ఆధ్వర్యంలో జరిగిన పుస్తక అవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా ఆవిష్కర్తగా వచ్చిన ఆచార్య అప్పల సోమేశ్వర శర్మ మాట్లాడుతూ ఇటువంటి అనువాద కార్యక్రమాలు పురాణేతిహాసాలన్నింటికీ అవసరం అన్నారు. సభాధ్యక్షులు ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ అనువాదం అనేది కత్తి మీద సాములాంటిదని అన్నారు. గ్రంధానికి ఆర్థిక దాత అయిన యు.ఎ.ఎన్. రాజు మాట్లాడుతూ సత్కార్యాలకు తమ సహాయం ఎప్పుడూ వుంటుందని అన్నారు.రచయిత మహావ్రత యాజుల శంకర శర్మ మాట్లాడుతూ తాను రాసిన ఈఅనువాద గ్రంథానికి ఒక రూపం ఇవ్వడంలో సహకరించిన మహానుభావులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభను విశాఖ సారస్వత వేదిక నిర్వాహకులు దుర్వాసుల భాస్కరమూర్తి ప్రారంభించారు.

## అలరించిన శాంతి,శార్వాణీల గానం

స్థానిక రామచేంద్ర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం అన్నమాచార్యభావవాహిని ఏర్పాటు చేసిన గానలహరి ఆహూతులను అలరించింది.ఎ.ఎస్.ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ శోభారాజ్ సంగీతం సమకూర్చిన కొన్ని అన్నమయ్య కీర్తనలు శాంతి చంద్రిక, కుమారి శార్వాణి(హైదరాబాద్) ఆలపించిన తీరు సంగీత ప్రియులను ఎంతో అలరించింది. వీరి గానానికి సత్యవిశాల్ వయోలిన్‌తో వి.రమేష్ మృదంగంతో సహకరించారు.కచ్చేరీలో వారు ఆలపించిన గేయాలలో పార్వతీ కుమారం,శరణంటి మాతని, గోవిందాశ్రిత గోకులబృందా,శ్రావణ బహుళాష్టమి,నారాయణ నమోనమో, ఇందిరా రమణుదెచ్చి అన్నవి శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశాయి.